క్లుప్తంగా

ప్రశాంతంగా 'పది' పరీక్షలు

కొవ్వూరు: పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు 1,250 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ జె.కెంపురత్నం తెలిపారు. మొత్తం 1,279 మందికి 29 మంది గైర్హాజరయ్యారని అన్నారు. ఐ.పంగిడి హైస్కూల్, కుమారదేవం హైస్కూల్, వాడపల్లి, కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పీఎంఎం హైస్కూల్, ప్రభుత్వ బాలికల హైస్కూల్, సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించారని వివరించారు.

న్యాయవాద గుమస్తాల సంఘం ఎన్నిక



సంఘ కార్యవర్గ సభ్యులు

కొవ్వూరు: కొవ్వూరులో న్యాయవాద గుమస్తాల సంఘ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండోసారి అధ్యక్షుడిగా బాలదారి బాజ్జీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా మంగిన శివరామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్‌గా పెన్నాడ స్వామినాయుడు, కార్యదర్శిగా కస్సే రామచంద్రరావు, జాయింట్ సెక్రటరీగా షేక్ సయ్యద్‌బాజీ, కోశాధికారిగా నున్న వీరవెంకట రవికుమార్, ఉప కోశాధికారిగా ఓసూరి కృష్ణలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సభ్యులు, న్యాయవాదులు అభినందించారు. అధ్యక్షుడు బాజ్జీ మాట్లాడుతూ న్యాయవాద గుమస్తాల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

శరవేగంగా డ్రైన్ల నిర్మాణం



కాపవరంలో డ్రైన్ నిర్మాణ పనులు

పెరవలి: కాపవరంలో డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి మంజూరైన రూ.20 లక్షలతో డ్రైన్లను నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీరావు మాట్లాడుతూ గడప గడపకూ కార్యక్రమంలో ప్రజల విన్నపాలకు అనుగుణంగా డ్రైన్లు నిర్మిస్తున్నామని అన్నారు. మంజూరైన రూ.20 లక్షలతో పాటు పంచాయతీ నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు మరో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్

ఉండ్రాజవరం: స్థానిక బౌద్ధదమ్మ పీఠంలో ఈ నెల 16 నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకూ ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ జరుగుతుందని బౌద్ధ భిక్షువు భంతే అనాలియో గురువారం తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే పాఠ్యాంశాల బోధన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కావాల్సిన వనరులను మల్లిన సత్యనారాయణ, బూరుగుపల్లి కళారావు, గ్రామ పెద్దలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇది శ్రీగోకుల్ కృష్ణ, టి.కృష్ణ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. విద్యార్థులు ముందస్తు రిజిస్ట్రేషన్ కోసం టి.కృష్ణ 98668 48509 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి

నిడదవోలు: ప్రజాస్వామ్యం పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెఆర్‌పీసీపీ జాతీయ చైర్మన్ బోడా రాకేష్ నాయక్ అన్నారు. సమిశ్రగూడెంలో హెఆర్‌పీసీపీ సభ్యుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల నూతన అధ్యక్షుడిగా పి.సింహాచలం, కార్యదర్శిగా కె.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ రాకడ సుదర్శన్‌రాజును నియమించారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామశ్రీనివాస్, మద్దిపాటి ప్రసాద్

నల్లజర్ల: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని జగన్నాథపురం సర్పంచ్ చెల్లారి రామశ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా జగన్నాథపురంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను గురువారం వారు ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని సంఘ సభ్యుడు కొల్లెం శ్రీధర్ తెలిపారు. మొదటి జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ జట్టుకు రూ.15 వేలు, తృతీయ జట్టుకు రూ.10 వేలు అందిస్తామని చెప్పారు. ఏలూరి నాగరాజు, గొలిమే ప్రదీప్ పాల్గొన్నారు.

రుచి.. శుచి ఉండాల్సిందే..

- మెనూ పక్కాగా అమలు చేయండి
- ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి
- అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లు, స్కూళ్ల తనిఖీ



ఊనగట్లలో సివిల్ సప్లయిస్ గిడ్డంగిని పరిశీలిస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి



యర్నగూడెం వసతి గృహంలో విద్యార్థుల హాజరును పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

కొవ్వూరు/చాగల్లు/దేవరపల్లి/నల్లజర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో ఆహార విషయంలో రుచి.. శుచికి ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాలు, మూడు హాస్టళ్లు, పౌర సరఫరాల గోదాములను తనిఖీ చేశారు. కొవ్వూరు గాజులవారి వీధిలో 39,422,45 అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యత, స్టాకు వివరాలు, హాజరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గాయత్రీ థియేటర్ సెంటర్‌లో రేషన్ దుకాణాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. పశివేదలలో జెడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కొవ్వూరులో రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మానేపల్లి వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు తమకు పౌర సరఫరాల గోదాములో బియ్యం తూకం వేసి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. విడివిడిగా తూకం వేసి ఇవ్వడం ద్వారా ఒక్కో డీలరుకు 100 నుంచి 150 కిలోల బియ్యం తరుగు వస్తుందని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఊనగట్లలో పౌర సరఫరాల శాఖ గోదామును పరిశీలించి డీలర్లకు కచ్చితంగా తూకం వేసి బియ్యం ఇవ్వాలని గోడౌన్ ఇన్‌చార్జిని ప్రతాప్‌రెడ్డి ఆదేశించారు. డీలర్ల నుంచి హమాలీల చార్జీలు అదనంగా వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

- చాగల్లు మండలం కుంకుడిమిల్లిలో అంగన్‌వాడీ కేంద్రంపై ఫిర్యాదు వచ్చిందని ఆయన అన్నారు. బెంగళూరులో నివాసం ఉంటున్న వారి పేరుపై రేషన్ కాజేస్తున్నారని అభియోగంతో రికార్డులు తనిఖీ చేశామని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. రికార్డుల్లో ఫిర్యాదులో ఇచ్చిన పేరు లేదన్నారు. కుంకుడిమిల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించగా కాలం చెల్లిన కందిపప్పు ప్యాకెట్లను గమనించి అంగన్‌వాడీ కార్యకర్తలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
- దేవరపల్లి మండలం యర్నగూడెం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల ప్రత్యేక వసతి గృహాన్ని చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లకు తలుపు లేక ఇబ్బంది పడుతున్నామని, గదుల్లో ఫ్యాన్లు లేవని వారు వివరించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులను చైర్మన్ ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం గ్రామంలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించి అక్కడ సదుపాయాలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వసతి గృహంలో పది మంది మాత్రమే ఉన్నారని చెప్పగా చైర్మన్ అవాక్కయ్యారు. ఈ నెల 3వ తేదీతో గడువు ముగిసిన గోధుమ, రాగిపిండిని గుర్తించారు. 50 కోడిగుడ్లు ఎక్కువగా ఉండడంతో వసతి గృహ సంక్షేమ అధికారిపై మండిపడ్డారు. సంక్షేమ అధికారిని వెంటనే సస్పెన్షన్ చేసి, ఏఎస్‌డబ్ల్యూఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఫోన్‌లో ఆదేశించారు.
- నల్లజర్లలోని అనాథ పిల్లల ఆనంద నిలయం (హాస్టల్)ను ప్రతాప్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి కల్పన, ఆహార ఏర్పాట్లపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ రోజు సాయంత్రం విద్యార్థులకు అల్పాహారం ఏర్పాటు చేయాలని తన పర్సు నుంచి రూ.వెయ్యి ఇచ్చారు. ఫుడ్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, డీఈఓ అబ్రహం, డీఎస్‌వో, లీగల్ అండ్ మెట్రాలజీ అధికారులు, సీడీపీఓలు, ఆయా మండలాల ఎంఈఓలు, ఏఎస్‌వోలు, సివిల్ సప్లయిస్ డీటీ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

హోం మంత్రి తానేటి వనిత



కొవ్వూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించాలని హోం మంత్రి తానేటి వనిత కోరారు. స్థానిక 12వ వార్డులో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ కుటుంబానికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా భవిష్యత్తులో మరింత మందికి మేలు చేకూరుతుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, కౌన్సిలర్ అంకోలు లిల్లీ వెంకట పద్మలీల, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మనందరి భవిష్యత్తు



నిడదవోలులో కౌన్సిలర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ప్రచారం



జగన్నాథపురంలో తలుపుపై మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ అంటిస్తున్న దృశ్యం

నిడదవోలు రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి జగనన్నే మనందరి భవిష్యత్తుగా నిలిచారని నిడదవోలు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 28 వార్డులు, మండలంలోని పందలపర్రు, రావిమెట్ల, కంసాలిపాలెం, గోపవరం, విజ్జేశ్వరం, తాడిమళ్ల గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించి ప్రజా సర్వే చేశారు. ప్రజల మద్దతుతో ఇంటి గోడలకు స్టిక్కర్లు అంటించారు. వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, నాయకులు యాళ్ల రామారావు, ఉప్పులూరి రామకృష్ణ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గృహ సారథుల మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజిని, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి పథకాల గురించి వివరించారు.

గోపాలపురం: జగన్నాథపురంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ ఇంటింటా పర్యటించారు. వైస్ ఎంపీపీ వంగా నారాయణ, సర్పంచ్ ఈడ్పిన సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తాళ్లపూడి: తిరుగుడుమెట్టలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, పార్టీ నాయకులు, వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి పథకాల గురించి ప్రచారం చేశారు. ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్ వల్లభశెట్టి గంగాభవాని, చిన్ని, మిద్దె పద్మ పాల్గొన్నారు. వేగేశ్వరపురంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది.

అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

పెరవలి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే అందరికీ స్ఫూర్తి కావాలని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అన్నారు. అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలను కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాపవరం, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు గ్రామాల్లో నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ దళితులకు అంబేడ్కర్ రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి

నిడదవోలు రూరల్: జై భారత్ ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 16న విజయవాడ బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జైభారత్ సామాజిక విప్లవ రణభేరి సభను జయప్రదం చేయాలని వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి డేవిడ్‌కుమార్ పిలుపునిచ్చారు. నిడదవోలు గాంధీనగర్‌లో దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను పిల్లి డేవిడ్‌కుమార్, దళిత నాయకులు గురువారం ఆవిష్కరించారు. నాయకులు పుచ్చకాయల ప్రేమ్, పిల్లి సురేష్‌కుమార్, సతీష్, చెల్లే సువర్ణరాజు, ప్రమోద్ పాల్గొన్నారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



తాళ్లపూడిలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాళ్లపూడి: విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఆ శాఖ ఏఈ సీహెచ్ వెంకటరావు తెలిపారు. గురువారం తాళ్లపూడి వేగేశ్వరపురంలో కొత్తగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లపూడిలో మోదుగులమ్మ జాతర, వేసవి దృష్టిలో పెట్టుకుని పనులు చేపట్టినట్టు తెలిపారు. దీనివల్ల ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో 14, 15 తేదీల్లో ఉదయం 8 గంట నుంచి 1 గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



చిక్కాలలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం జగదాంబ

చాగల్లు: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని జిల్లా పంచాయతీ అధికారి టి.జగదాంబ అన్నారు. చిక్కాల గ్రామ సచివాలయాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ ఇంటి పన్నుల వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యే మణి, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు

పెరవలి: రెండో ద్వారకా తిరుమలగా పేరుగాంచిన అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను బుధవారం లెక్కించామని ఆలయ ఈఓ జీఎస్ శ్రీనివాస్ తెలిపారు. వీటి ద్వారా 29 రోజులకు రూ.1.97 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని, అదే విధంగా ఆలయ గ్రామ కమిటీ, గ్రామ పెద్దల సహకారంతో ప్రతి శనివారం ఉచిత అన్నసమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు. దేవదాయ ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ ఎం.వరప్రసాద్, పంతం చిన్న, పులపర్తి నాగరాజు, పంతం నాగేశ్వరరావు, యాళ్లబండి శ్రీనివాస్, కోటిపల్లి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

సర్వేరాళ్లు త్వరితగతిన వేయించాలి

దేవరపల్లి: జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాల్లోని పొలాల్లో సరిహద్దు రాళ్లను త్వరితగతిన వేయించాలని కొవ్వూరు ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తెలిపారు. పల్లంట్లలోని పొలాల్లో రీసర్వేలో భాగంగా సర్వే రాళ్లు పాతించే తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఈ గ్రామంలో రాళ్లు పాతే పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కొవ్వూరు డివిజన్ తొమ్మిది మండలాల్లో 11 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించినట్టు తెలిపారు. 11 గ్రామాల్లో 8,182 రాళ్లు పాతించాల్సి ఉండగా, 4,805 రాళ్లు పాతించామన్నారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కేవీ రామకృష్ణ, సర్వేయర్ వి.కృష్ణకుమార్ పాల్గొన్నారు.

జీటీపీఎస్ ఉద్యోగులకు సంఘీభావం



సీతంపేటలో విజ్జేశ్వరం జీటీపీఎస్ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు

కొవ్వూరు: విజ్జేశ్వరం జీటీపీఎస్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు కాంగ్రెస్ నాయకులు గురువారం సంఘీభావం ప్రకటించారు. సంస్థ మూతపడడంతో ఐదు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నామని, కుటుంబ సమేతంగా గేటు ఎదుట ధర్నా చేస్తున్నా తమ గోడు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా కొవ్వూరు, నిడదవోలు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జులు అరిగెల అరుణకుమారి, పెద్దిరెడ్డి సుబ్బారావు దీక్షలో కూర్చున్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, రాష్ట్ర కోఆప్షన్ సభ్యుడు అగర్వాల్ హీరాలాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గెద్దం సాయిబాబా, కొవ్వూరు పట్టణ అధ్యక్షుడు గంధం బాపూజీ, మహ్మద్ అన్వర్‌ఖాన్ కాసిం పాల్గొన్నారు.

రాజ్యాంగ పుస్తకాల అందజేత

దేవరపల్లి: యాదవోలులోని ప్రభుత్వ ఉద్యోగులకు స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ డి.సువర్ణరాజు భారత రాజ్యాంగ పుస్తకాలను గురువారం అందజేశారు. గ్రామంలోని ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు సుమారు 100 పుస్తకాలను అందజేసినట్టు ఆయన చెప్పారు.

సారా బట్టీలపై దాడి

దేవరపల్లి: సారా బట్టీలపై దాడులు చేసి 45 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ సీఐ దిమ్మల సుధ తెలిపారు. దేవరపల్లి పొలాల్లో సారా కాస్తున్న గుబ్బల శ్రీను, గుబ్బల సాయిబాబు, సారా తయారీకి బెల్లం సరఫరా చేస్తున్న తీగల హరిశేషులను అరెస్ట్ చేసినట్టు ఆమె వివరించారు. తెలికిచర్ల గ్రామంలో వాకల రామకృష్ణను అరెస్ట్ చేసి, అతని నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గ్రామానికి చెందిన గాడి అశోక్‌బాబు ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆరు కాసుల బంగారు ఆభరణాలు అపహరించినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. 11వ తేదీన ఈ చోరీ జరిగిందన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

ఉండ్రాజవరం: చివటంలో బుధవారం గోస్తనీ కాలువలో ఈతకు వెళ్లి గల్లంతైన యువకుడి మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఎస్సై కె.రామారావు తెలిపారు. పోతవరం గ్రామానికి చెందిన మందపాటి జాన్ ఆశీష్ (20) స్నేహితులతో బుధవారం కాలువలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. ఈ మేరకు మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

నిడదవోలు రూరల్: పురుగు మందు తాగిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ గురువారం తెలిపారు. పురుషోత్తపల్లికి చెందిన మొగలపు స్వాతి (30) ఈ నెల 12న కుటుంబ సభ్యులతో గొడవపడి క్షణికావేశంలో పురుగు మందు తాగింది. ఆమెను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సోదరి జన్నీ రేణుక ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు

నిడదవోలు రూరల్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సమిశ్రగూడెం అంబేడ్కర్ విగ్రహం వద్ద తృప్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం బొల్లినేని హాస్పటల్ (కిమ్స్) వైద్య బృందం పర్యవేక్షణలో సుమారు 300 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆసుపత్రి ఈడీ స్వర్ణ రామ్మోహన్, తృప్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు వడ్లమూడి దేవదాస్, రాకడ సుమతి, బీఆర్ అంబేడ్కర్ యూత్ సభ్యుడు బిర్దుగంటి గోపి పాల్గొన్నారు.

చాగల్లు: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కలవలపల్లిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం మహవీర్ ఆస్పత్రి వైద్యుడు ఎస్.రామకృష్ణ వైద్య సేవలు అందించారు. 110 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు కొలాటి శ్రీను, బండి ఆనంద్, ఉబా వెంకట్రావు, వెంకటేష్ పాల్గొన్నారు.

నీటి కొరత రాకుండా చర్యలు

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణ ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద మున్సిపల్ సాధారణ నిధులు రూ.4.04 లక్షలతో కొనుగోలు చేసిన మంచినీటి ట్యాంకర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కమిషనర్ కేవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

దాతల ప్రోత్సాహం వినియోగించుకోవాలి

నిడదవోలు రూరల్: దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్కే వజీరుద్దీన్ అన్నారు. నిడదవోలు పెద్ద మసీదు వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని దాతరంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో 65 మంది వృద్ధులకు దుప్పట్లు, డ్రైఫ్రూట్స్ అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు గూడపాటి సుబ్బారావు, కార్యదర్శి జేష్ఠ వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్కే అజీబ్‌బాషా, ఎస్కే మీరా పాల్గొన్నారు.

ప్రచార భేరీ పోస్టర్ ఆవిష్కరణ

ఉండ్రాజవరం: ప్రధాని మోదీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి నినాదంతో ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం పార్టీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రచార భేరీని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు తెలిపారు. ఉండ్రాజవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ప్రచార భేరీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సీపీఎం మండల కార్యదర్శి తూరుగోపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొవ్వూరు: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 14 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రచార భేరి పోస్టర్‌ను గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుందరబాబు, దగ్గు రాధాకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్తును పొదుపుగా వాడుకుందాం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈఈ వెంకటేశ్వరరావు

నల్లజర్ల: వ్యవసాయ రంగంలో విద్యుత్తును పొదుపుగా వాడుకుందామని తాడేపల్లిగూడెం డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ ఎస్.వెంకటేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లజర్లలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యుత్తు తయారీకి అవసరమైన ఇంధన వనరుల కొరత ఏర్పడనున్న దృష్ట్యా మనం ఇప్పటినుంచే సోలార్ పవర్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. థర్మల్ విద్యుత్తు తయారీలో వినియోగించే బొగ్గుతో వాతావరణం కాలుష్యమై ఒక్కో సందర్భంలో ఆమ్ల వర్షాలు పడి పంటలు పాడైపోయే ప్రమాదముందన్నారు. రైతులు ఒక శాతం విద్యుత్తు ఆదా చేసినా అందరి ప్రయత్నం సఫలమైనట్టేనన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. నాణ్యమైన వాటర్ పంపులు, ఐఎస్ఐ పైపుల వినియోగంతో విద్యుత్తు ఆదా అవుతుందన్నారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి తీగల చోరీ జరుగుతున్నాయని అన్నారు. అటువంటి వాటిని అరికట్టడానికి రైతులే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలన్నారు. రూరల్ డీఈ రామకృష్ణ, నల్లజర్ల ఏడీఏ రాజాబాబు, ఏఈలు బాపిరాజు, ఎంవీ రమణ, పీకేడీ పరమేశ్వరరావు, సర్పంచులు చెల్లారి రామశ్రీనివాస్, ప్రగడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.